సాక్షి
కుమురం భీం

మంగళవారం ॥ 19 ॥ మార్చి ॥ 2024



ప్రమాదకరంగా మూలమలుపులు
తిర్యాణి నుంచి మంచిర్యాల వైపు వెళ్లే దారిలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఘాట్ సెక్షన్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. 9లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ: 6:28	బుధ: 4:58

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.7 /20.1
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్


మొక్క అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయంలో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఉన్నారు.

పోలీసుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: సమాజంలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీసుల పాత్ర కీలకమని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో పోలీసు సిబ్బందికి వారం రోజులపాటు నిర్వహించే గ్రేహౌండ్స్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది శారీరక దారుఢ్యం, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘాకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చెక్‌పోస్టుల వద్ద డ్యూటీలు, వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఆర్‌ఐ అడ్మిన్ పెద్దన్న, సీఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి


అధికారులు, కార్మికులతో ఎండీ సజ్జనార్

ఆసిఫాబాద్‌అర్బన్: విధి నిర్వహణలో ఆర్టీసీ కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఎండీ సజ్జనార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో, పెట్రోల్ బంక్‌ను సోమవారం డిపో మేనేజర్ విశ్వనాథ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో అధికారులు, కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విధుల్లో జాగ్రత్తగా ఉంటూ ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీకి జిల్లా జట్టు


వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల నుంచి 20 మందితో కూడిన జిల్లా జట్టు హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి వాటర్‌స్పోర్ట్స్ అకాడమీకి సోమవారం బయలుదేరి వెళ్లిందని డీటీడీవో రమాదేవి, డీఎస్‌వో మీనారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీ స్కూల్ పోటీలకు జిల్లా నుంచి 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, హెచ్‌ఎం కృష్ణారావు, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, పీడీలు వనిత, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం లక్కీడ్రా ద్వారా విద్యార్థిని ఎంపిక చేశామని అదనపు కలెక్టర్ వేణు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ ఉప సంచాలకుడు సజీవన్‌తో కలిసి లక్కీడ్రా నిర్వహించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు కాగజ్‌నగర్‌కు చెందిన అర్యాన్ గవాడీ ఎంపికయ్యాడని తెలిపారు. వెయిటింగ్ లిస్టులో బెండారే హిమాన్ష్, దుర్గం భవ్యాన్ష్ ఉన్నారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థికి ఉచిత చదువుతోపాటు వసతి సౌకర్యం ఉంటుందన్నారు.

ఒంటిపూటే అంగన్‌వాడీ


కెరమెరి మండలంలోని చందుగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన

- మే 31 వరకు కొనసాగింపు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహణ
- ఎండ వేడి నుంచి ఉపశమనం
- జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఇప్పటికే పాఠశాలల్లో ఈ నెల 15 నుంచి ఒంటిపూట తరగతులు కొనసాగుతుండగా.. తాజాగా అంగన్‌వాడీ కేంద్రాలు సైతం మధ్యాహ్నం వరకే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న రెండు నెలల పాటు వేసవి వేడి అధికంగా ఉండే అవకాశం ఉండటంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాలని ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు అందాయి.

973 సెంటర్లు
జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 40 సెక్టర్లు ఉన్నాయి. ఇందులో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆరేళ్లలోపు చిన్నారులు 49,029 మంది ఉండగా.. బాలింతలు 4,518 మంది, గర్భిణులు 4566, కిశోర బాలికలు 22,820 మంది ఉన్నారు. వేసవి ప్రారంభం కావడంతో జిల్లాలో మార్చిలోనే 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరువగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం ఆకాశం మబ్బులు పట్టి వాతావరణం కొంత మేర కు చల్లబడినా.. మరో వారం తర్వాత ఎండలు మరింత పెరిగే అవకాశం ఉంది. సాధారణంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారు. వేసవిలో వడగాల్పులతో చిన్నారులు అవస్థలు పడే అవకాశం ఉండటంతో మే 31 వరకు ఒంటిపూట అంగన్‌వాడీ కేంద్రాలు తెరవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి కేంద్రాలు ఉదయం 8 గంటలకే తెరుచుకోనున్నాయి. ఆయా సెంటర్లలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.30 గంటల కు చిన్నారులు ఇళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకుంటారు.

వసతులు కరువు..
జిల్లాలో చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. అద్దె భవనాలు, పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ఇరుకు గదుల్లో విద్యుత్ సౌకర్యం లేక చలికాలంలోనే చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. వేసవిలో ఉక్కపోతతో మరింత అవస్థలు పడే అవకాశం ఉంది. కొన్ని కేంద్రాలకు అయితే సాగు నీటి సౌకర్యం లేక ఇళ్లనుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు విద్యుత్ సౌకర్యం లేక కొన్ని నెలల క్రితం ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరు చేసిన టీవీలు కూడా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒంటిపూట అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించడం చిన్నారులకు ఉపశమనంగా మారనుంది. అలాగే ఎండల తీవ్రతకు అనుగుణంగా మే నెలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు 15 రోజుల చొప్పున సెలవులు ప్రకటించనున్నారు.

మబ్బుల దడ!


దహెగాం మండలంలో ఆరబెట్టిన మిర్చి పంట

- జిల్లాకు వర్షసూచన
- చల్లబడిన వాతావరణం
- కల్లాల్లో ఆరబెట్టిన మిరప పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం

దహెగాం(సిర్పూర్): జిల్లాలో వాతావరణం చల్లబడింది. నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటోంది. మబ్బులతో అన్నదాతలు కలవరం చెందుతున్నారు. గత వారం పలు ప్రాంతాల్లో తేలికపాటి చినుకులు సైతం కురిశాయి. పక్కనే ఉన్న ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో రెండు రోజుల క్రితం వడగండ్లు సైతం పడ్డాయి. మంగళ, బుధ, గురువారాల్లో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు వర్ష సూచన ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కల్లాల్లో మిరప.. పొట్టదశలో వరి
ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 1800 ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. మొదటిదశలో కొంతమంది రైతులు పంట కోసి నాగ్‌పూర్‌లో విక్రయించారు. మరికొంత మంది ధర లేని కారణంగా కోసి కల్లాల్లోనే ఆరబెట్టారు. అకాల వర్షం కురిస్తే వీరు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్తగా కొంతమంది టార్పాలిన్లు తెచ్చుకుని కప్పుతున్నారు. మరో వైపు కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట్, కౌటాల, రెబ్బెన, తిర్యాణి, బెజ్జూర్ మండలాల్లో వరి సాగు దాదాపు 18 వేల ఎకరాల్లో ఉంది. దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లో పలువురు సీడ్ వరి సాగు కూడా చేస్తున్నారు. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉంది. మబ్బులతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. మబ్బులతో సీడ్ వరిలో ఫ్లవరింగ్(పూత) అంతగా రావడం లేదని వాపోతున్నారు. మబ్బులు ఇలాగే కొనసాగితే మామిడి పూత రాలిపోయే ప్రమాదం కూడా పొంచి ఉంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



అకాల వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. మొక్కజొన్న రెండు వేల ఎకరాల్లో సాగవుతోంది. ఆరబెట్టిన మిర్చి పంట తడవకుండా టార్పిలిన్లు కప్పుకోవాలి. వర్షం పడితే దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది.
– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

‘పది’ వార్షిక పరీక్షలు షురూ


కెరమెరి: నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు


దహెగాం: బైక్‌పై వస్తున్న ముగ్గురు విద్యార్థినులు

- తొలిరోజే ఇద్దరు డిబార్
- 6,408 మంది హాజరు.. 49 మంది గైర్హాజరు

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 6,457 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6408 మంది హాజరయ్యారు. 49 మంది గైర్హాజరయ్యారు. డీఈవో అశోక్ కెరమెరిలోని రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. కాపీయింగ్ పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పర్యవేక్షించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించాలన్నారు. పదో తరగతి కేంద్రాల వద్ద 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

పరీక్షకు హాజరైన అంధ విద్యార్థి..


పరీక్ష కేంద్రం వద్ద తాజ్‌బాబా

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం ముత్తంపేట్ గ్రామానికి చెందిన షేక్ జలీల్, తహెరా దంపతుల కుమారుడు తాజ్‌బాబా పుట్టుకతోనే అంధుడు కాగా.. మానసిక సమస్యలతోనూ బాధపడుతున్నారు. ముత్తంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో సోమవారం తొమ్మిదో తరగతి విద్యార్థి ఆదే స్వాతి సాయంతో పరీక్షకు హాజరయ్యాడు. తాజ్‌బాబా తండ్రి బైక్ పంక్చర్ షాపు నిర్వహిస్తుండగా.. తల్లి భవిత కేంద్రంలో ఆయాగా పని చేస్తోంది.

అనుమానిత లావాదేవీలపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బ్యాంకుల ద్వారా జరిగే నగదు లావాదేవీలపై దృష్టి సారించి, నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకుల్లో రూ.లక్ష కంటే ఎక్కువ నగదు జమ చేసినా.. డ్రా చేసినా.. సంబంధిత వివరాలను ఎన్నికల ఖర్చుల పరిశీలకులకు అందించాలని ఆదేశించారు. ఒకే ఖాతా నుంచి వివిధ ఖాతాలకు నగదు బదిలీ చేసినా పరిశీలించాలన్నారు. నామినేషన్లకు ముందే ఖాతాలు తెరిచేందుకు బ్యాంకులకు వచ్చే అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ సభ్యులు, అనుచరుల ఖాతాలపై నిఘా ఉంచాలన్నారు. లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ హనుమంత్‌రావు తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూంలు పరిశీలన
జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్‌రూంల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును సోమవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అదనపు కలెక్టర్ దాసరి వేణు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండేతో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి బీఎస్పీ నాయకులు

కౌటాల(సిర్పూర్): బీఎస్పీకి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజీనామా చేసిన తర్వాత సిర్పూర్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు బీఎస్పీ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బహుజన్ సమాజ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లెండుగురే శ్యామ్‌రావు, నాయకులు జాడి శ్యాంరావు, రాంటెంకి నవీన్, అమ్మ శ్రీకాంత్, ఆవుల రాజ్‌కుమార్ యాదవ్, కొండా రాంప్రసాద్, కె.రాజు, మంజుల, కమల, రమాదేవి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆర్‌ఎస్పీ వెంటే ఉండి బహుజనుల అభ్యున్నతికి పని చేస్తామని పేర్కొన్నారు.

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన అదనపు కలెక్టర్లు, ఎస్పీ, తదితరులు

ఆసిఫాబాద్: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎఫ్‌వో నీరజ్ టిబ్రివాల్‌తో కలిసి నోడల్ అధికారులతో సోమవారం ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లోకసభ ఎన్నికల కోసం సిర్పూర్ నియోజకవర్గంలో 320, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 356 పోలింగ్ కేంద్రాలు ఉండగా, సహాయక పోలింగ్ కేంద్రాలతో మొత్తం 676 కేంద్రాలు ఏర్పాటు చేసి, బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 4,55,437 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 2,26,994 మంది పురుషులు, 2,28,415 మంది మహిళలు, 28 మంది ట్రాన్స్‌జెండర్లు, 404 మంది సర్వీస్ ఓటర్లు, 5,556 మంది 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 6,931 మంది దివ్యాంగులు ఉన్నారని పేర్కొన్నారు. 9 స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీంలు, 8 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 9 వీడియో సర్వేయల్స్ టీంలు, 2 వీడియో పరిశీలన బృందాలు, 8 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, 2 అకౌంటింగ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జూన్ 6న ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం, జిల్లా గ్రీవెన్స్ కమిటీ, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశామని వివరించారు. నిబంధనల మేరకు ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేట్ స్థలాల్లోని రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, ఫొటోలు, వాల్ రైటింగ్స్ తొలగిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ర్యాలీలు, సభల నిర్వహణకు నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో 1950 నంబర్‌తో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, సీవిజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై స్పందించాలన్నారు. రూ.50 వేల కంటే అధికంగా నగదు తరలిస్తే సీజ్ చేస్తామని, ఆధారాలు ఉంటే గ్రీవెన్స్ సెల్‌లో సంప్రదించాలని 24 గంటల్లో నగదు విడుదల చేస్తామని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని సూచించారు.

అడ్డుగోడలు తొలగింపు

- రాకపోకలు పునరుద్ధరించేందుకు మున్సిపల్ అధికారుల చర్యలు
- పరిశీలించిన ఎమ్మెల్యే ‘పాల్వాయి’
- గడువు కోరిన ఎస్పీఎం యాజమాన్యం


అడ్డుగోడ తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు


బాలభారతి పాఠశాల ఎదుట రహదారిపై కర్ర

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం పలు రహదారులను మూసివేస్తూ గతంలో అడ్డంగా గోడలు నిర్మించిన విషయం తెలిసిందే. ఈ అడ్డుగోడలను సోమవారం తెల్లవారుజామున మున్సిపల్ అధికారులు కూల్చివేయడం వివాదాస్పదంగా మారింది.

రెండేళ్ల క్రితం నిర్మాణం..
ఎస్పీఎం యాజమాన్యం రెండేళ్ల క్రితం పట్టణంలోని ఫారెస్టు ఆఫీస్ వెనుక రోడ్డు(ఈఎస్‌ఐ టర్నింగ్), బాలభారతి పాఠశాల ఎదుట రహదారి, తదితర ప్రాంతాల్లో ప్రజలు రాకపోకలు సాగించొద్దనే ఉద్దేశంతో అడ్డుగోడలు నిర్మించింది. దశాబ్దాలుగా రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారులను మూసివేయడంతో పట్టణ ప్రజలు, వాహనదారులు అప్పట్లో నిరసనలు, ఆందోళనలు నిర్వహించారు. పలు పార్టీలు సైతం వీరికి మద్దతు తెలిపాయి. ఈ క్రమంలో మున్సిపల్ పాలకవర్గంతోపాటు అధికారులు అడ్డుగోడలను సోమవారం తొలగించడం మొదలుపెట్టడంతో వివాదం చెలరేగింది. ఓ వైపు యాజమాన్యం ప్రతినిధులు, మరోవైపు మున్సిపల్ అధికార, సిబ్బంది వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితులను పర్యవేక్షించారు. కాగజ్‌నగర్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పదాధికారులు కూడా అక్కడికి చేరుకుని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రహదారికి అడ్డంగా కర్ర
గోడలు కూల్చివేయడం ద్వారా ఈఎస్‌ఐ టర్నింగ్ నుంచి రాకపోకలు ప్రారంభం కావడంతో మిల్లు యాజమాన్యం, ప్రతినిధులు అప్రమత్తమయ్యారు. బాలభారతి టర్నింగ్ నుంచి ఎస్పీఎం క్రీడా మైదానం వరకు ఉన్న రహదారి గోడలు సైతం తొలగించడంతో ఆ రహదారి గుండా రాకపోకలు అడ్డుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. బల్దియా అధికారులు, పాలకవర్గ సభ్యులు, మిల్లు ప్రతినిధులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. బల్దియా ఆధ్వర్యంలో ఈ రహదారి అడ్డుగోడలు తొలగించగా, మిల్లు ప్రతినిధులు ఆ రహదారిపైనే మిల్లుకు చెందిన కర్రను తీసుకువచ్చి ఉంచడంతో రాకపోకలకు వీలు లేకుండా పోయింది. మళ్లీ వివాదం చెలరేగడంతో డీఎస్పీ కరుణాకర్ ఆదేశాల మేరకు సీఐ శంకరయ్య ఇరుపక్షాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రెండు రోజుల సమయం ఇవ్వాలని, అకస్మాత్తుగా గోడలు తొలగించడం సరికాదని ఎస్పీఎం ప్రతినిధులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని మరో రెండు రోజుల గడువు ఇవ్వాలంటూ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. రెండు, మూడు రోజుల తర్వాత బల్దియా ఆధ్వర్యంలో రహదారుల పునరుద్ధరణ ప్రక్రియ మళ్లీ మొదలు కానుంది.

శుభపరిణామం : ఎమ్మెల్యే హరీశ్‌బాబు


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

పేపర్ మిల్లు యాజమాన్యం అక్రమంగా నిర్మించిన అడ్డుగోడలను మున్సిపల్ అధికారులు తొలగించడం శుభపరిణామని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. గోడలు తొలగిస్తున్న ప్రాంతాన్ని ఎమ్మెల్యే సోమవారం పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రైల్వే స్టేషన్‌కు రవాణా సౌకర్యం లేకపోవడంతో గోడలు తొలగించాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. మాస్టర్‌ప్లాన్, మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా గతంలో ఎస్పీఎం యాజమాన్యం అడ్డుగోడలు నిర్మించిందని ఆరోపించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మహమూద్ (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ టేకుల బస్తీ ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ రిటైర్డు డ్రైవర్ మహమూద్ (65) చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. వన్ టౌన్ ఎస్సై సురేష్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మహమూద్ వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఓ యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా వాహనదారుడు ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంటలో ట్రాలీలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న మూడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన వారణాసి లక్ష్మణ్ మందమర్రి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి దూర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి ట్రాలీని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి



సీజ్ చేసిన మద్యాన్ని చూపిస్తున్న సీఐ

మందమర్రిరూరల్: పట్టణంలోని పలు బెల్ట్‌షాపులపై మందమర్రి పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పట్టణంలోని మొదటి జోన్‌లో కిరాణా దుకాణంతో పాటు బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న కొనగంటి సురేష్ ఇంట్లో దాడులు నిర్వహించి అక్రమంగా నిలువ ఉంచిన 74.91 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. నిందితున్ని, మద్యాన్ని పోలీస్ స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శశిధర్‌రెడ్డి ఎస్సై రాజశేఖర్‌తోపాటు పోలీసు సిబ్బందిని అభినందించారు.

యువతి అదృశ్యం

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంబగట్ట గ్రామానికి చెందిన ఆకిరెడ్డి సాయిరాణి (20) అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఈ నెల 16న ఇంటినుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి సోదరుడు ఆకిరెడ్డి సాయిక్రిష్ణ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

- ప్రేమ పెళ్లి వరకు వెళ్లడం లేదని మనస్తాపం..
- పెద్దలను ఒప్పించే ధైర్యం లేక తనువు చాలిస్తున్న వైనం..
- మూడు పదుల వయసులోపే ముగుస్తున్న జీవితాలు
- కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్న బలవన్మరణాలు



ప్రేమిస్తే.. చావేనా?

నెన్నెల(బెల్లంపల్లి): ప్రేమ.. నేటి యువతకు పరిచయం అక్కర్లేని పదం. తెలిసీ తెలియని వయస్సులో ఆకర్షణో.. ప్రేమో అర్థం చేసుకోలేక ఆలోచించే పరిపక్వత లేక జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటూ కన్నవారికి కడుపు కోత మిగులుస్తున్నారు. ప్రేమ విషయం పెద్దలకు చెప్పుకోలేక , ప్రేమను ప్రియుడు, ప్రియురాలు నిరాకరించడంతో అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం కేటాయించి వారిలో స్నేహభావం పెంపొందిస్తేనే ఇలాంటి సమస్యలకు పరిష్కార మార్గం దొరుకుతుందని మానసిక వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సినిమాల ప్రభావంతో..

సినిమాల ప్రభావం నేటి యువతరం మీద ఎంతగానో పడుతోంది. ప్రేమ అనే అంశం లేకుండా సినిమాలు ఉండటం లేదు. వీటిని చూసిన యువత ప్రేమకు ఆకర్షితులవుతున్నారు. దీనికి తోడు సెల్‌ఫోన్‌లు ప్రేమికులను మరింత చేరువ చేస్తున్నాయి. చాటింగ్,వాట్సాప్‌కాల్,వీడియోకాల్‌తో ప్రేమికులు నిత్యం కలుసుకునేందుకు వీలుగాఉంటోంది. సోషల్ మీడియా ప్రభావం కూడా యువతపై పడుతోంది.

మచ్చుకు కొన్ని ఘటనలు

- బెల్లంపల్లి పట్టణం షంషీర్‌నగర్‌కు చెందిన సోయం తేజశ్రీ నెన్నెల మండలం లంబాడితండాకు చెందిన దరావత్ రాజ్‌కుమార్ కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ఏంచేయాలో తోచక తేజశ్రీ అక్టోబర్ 6, 2022న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది.
- కుశ్నపల్లికి చెందిన జాడి రవి, వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామానికి చెందిన సత్యశ్రీ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. సత్యశ్రీ అనారోగ్యానికి గురికావడంతో మృతి చెందింది. ప్రియురాలి లేని జీవితం వ్యర్థమని భావించిన రవి 2022 ఫిబ్రవరి 9న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- 2023 ఫిబ్రవరి 19న హాజీపూర్ మండలం దొనబండలో ఆర్థిక ఇబ్బందులతో శ్రీకాంత్ అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రియురాలు సంఘవి ప్రియుడు లేని లోకంలో నేనుండలేనని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.
- బెల్లంపల్లి పట్టణానికి చెందిన సాజిద్, యశ్వంతిక కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో 2021 అక్టోబర్ 23న జైపూర్ శివారులోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.
- భీమిని మండలం మల్లీడి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని దొబ్బల కల్పన, అదే గ్రామానికి చెందిన కోట మల్లేశ్ ప్రేమించుకున్నారు. మల్లేశ్ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన కల్పన 2021 డిసెంబర్ 26న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.
- మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన నాంపల్లి సంగీత, నెన్నెల మండలం చిత్తాపూర్‌కు చెందిన తీగుళ్ల భగవాన్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. భగవాన్‌తో పెళ్లికి నిరాకరించిన యువతి తల్లిదండ్రులు వేరే పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో మనస్తాపం చెందింది. ఈ నెల 13న ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలి మరణవార్త విన్న ప్రియుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

తల్లిదండ్రులు స్నేహితులుగా మెలగాలి

ప్రతీ మనిషికి స్నేహితుడి తోడు ఎంతో అవసరం. మంచి, చెడులను వివరించి చెప్పగలిగే స్నేహితుడు దొరికినట్లయితే వారు చాలా అదృష్టవంతులు. అమ్మానాన్నలు తమ పిల్లలను స్నేహితులుగా భావించాలి. వారికి కలిగే చిన్న చిన్న సమస్యలను మొదలుకొని ప్రేమ వ్యవహారాల్లో సైతం స్నేహితుడి పాత్ర పోషించాలి. పెద్దలకు తెలియకుండానే ఏమనుకుంటారనో, ఏమైనా చేస్తారోననే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

తల్లిదండ్రులు, టీచర్లు గమనిస్తూ ఉండాలి



పిల్లల ప్రవర్తనను ఇంట్లో తల్లిదండ్రులు, బడిలో టీచర్లు గమనిస్తూ ఉండాలి. పిల్లలు తప్పు చేస్తే కొట్టడం, తిట్టడం చేయకుండా ఓపికతో మాట్లాడి నచ్చజెప్పాలి. చెడు మార్గం వైపు వెళ్లకుండా చూడాలి. ప్రేమికులు మొదట తల్లిదండ్రుల మనస్సు గెలుచుకోవాలి. ప్రేమించడంతో పాటు యోగ్యతను సంపాదించాలి. ఆర్థిక స్థిరత్వం ఉంటే తల్లిదండ్రులు ఒప్పుకునే వీలుంటుంది. అనుకున్నది జరగకపోతే తట్టుకునే శక్తి లేక యువత క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. యువతకు భవిష్యత్‌లో లక్ష్యం లేకపోవడం కూడా ఒక కారణం.

– డాక్టర్ సునీల్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు, మంచిర్యాల

చట్టాలను ఉపయోగించుకోవాలి



యువత చట్టాన్ని ఉపయోగించుకుని చట్టపరమైన హక్కులు సాధించుకోవాలి. పిరికితనంతో ఆత్మహత్యలకు పాల్పడవద్దు. ప్రస్తుత కాలంలో పిల్లలు ఆటలకు దూరం కావడం కూడా ఒక కారణం. ఆటలు ఆడటం ద్వారా గెలుపు, ఓటములను తట్టుకునే శక్తి ఉంటుంది. ముఖ్యంగా యువత సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి. సమస్యలు ఎదురైతే ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకోవాలి. బ్రతకడానికి ఎన్నో మార్గాలు, చావడానికి ఒకటే మార్గం. ధైర్యంగా ముందుకు నడవాలి.

– శ్యాంపటేల్, ఎస్సై, నీల్వాయి

గద్దెరాగిడిలో చోరీ


వివరాలు తెలుసుకుంటున్న సీఐ

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడిలో ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అమ్మగార్డెన్స్ ఏరియాలోని రోడ్ నెంబరు 36లో నివాసముండే బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 22వ వార్డుకు చెందిన కౌన్సిలర్ పద్మావతి కొద్ది రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి బెల్లంపల్లికి వెళ్లింది. సోమవారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.15వేల నగదుతో పాటు ఒక కెమెరా చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ ఘటనాస్థలిని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాసిపేట గనిపై కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న కార్మికులు

కాసిపేట: నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై సోమవారం టెండాల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్షణ చర్యలు పాటించకుండా అధికారులు వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెంట్ రాందాస్, కార్మిక సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం అధికారులు, కార్మిక సంఘాల నాయకులు టెండాల్ కార్మికులతో చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఐఎన్‌టీయూసీ నాయకులు భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నస్పూర్: రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు టీయూడబ్ల్యూజే(ఐజేయూ), నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ సభ్యులు, రెడ్డి సంఘం నాయకులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 6న ఎన్నికల కోడ్ ముగుస్తుందని, ఆలోపు జర్నలిస్టుల ఇళ్లస్థలాలతోపాటు సంక్షేమంపై మార్గదర్శకాలు, విధివిధానాలు రూపొందించి సీఎంకు నివేదిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్, జిల్లా, మండల కేంద్రాల్లోని అర్హులైన విలేకరులు అందరికీ ఇళ్లతోపాటు సంక్షేమ పథకాలు అమలుపరిచేలా చూస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పత్రికా విలువలను కాపాడడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి సంపత్‌రెడ్డి, సంఘం నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

సివిల్ ఎస్ఈగా షేక్ మదీనా బాషా


శాలువాతో సత్కరిస్తున్న కాంట్రాక్టర్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా సివిల్ నూతన ఎస్ఈగా షేక్ మదీనా బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఏరియా సివిల్ డీజీఎంగా విధులు నిర్వహించిన సతీష్‌బాబును యాజమాన్యం కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేయగా ఆయన స్థానంలో షేక్ మదీనా బాషాను బెల్లంపల్లి ఏరియాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఏరియా సివిల్ డిపార్టుమెంట్ సిబ్బందితో పాటు కాంట్రాక్టర్లు నూతన ఎస్ఈకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఈ సివిల్ రాజేంద్రప్రసాద్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ భన్సీలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భన్సీలాల్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్ ఫతేపూర్ జిల్లా పెందూలి గ్రామానికి చెందిన గౌరవం మిశ్రా ఈ నెల 17న ఏటీఎంలో చోరీకి యత్నిస్తుండగా స్థానికులు గమనించి బెదిరించడంతో పారిపోయాడు. స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు సీఐ భన్సీలాల్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా దొంగతనానికి యత్నించిన కట్టర్, మంగలికత్తి అక్కడే వదిలేసి పారిపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సోమవారం రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీసీపుటేజీల ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై మహేందర్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉడిపి నుంచి అయోధ్యకు పాదయాత్ర


స్వామీజీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: దేశ ప్రజలందరు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో కర్ణాటకలోని ఉడిపికి చెందిన లక్ష్మీపతి స్వామీజీ అయోధ్యకు పాదయాత్రగా బయలుదేరారు. సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయనకు బీజేపీ నాయకులు ఖాండ్రె విశాల్, ఈదులవాడ గణేశ్ శ్రావణ్‌గౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీపతి మాట్లాడుతూ లోక కల్యాణార్థం 2016లో ఉడిపి నుంచి అయోధ్య రామాలయం వరకు పాదయాత్రగా బయలుదేరానన్నారు. ఇప్పటి వరకు కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ మీదుగా తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెట్టానన్నారు. మహారాష్ట్ర మీదుగా అయోధ్యకు వెళ్లనున్నట్లు తెలిపారు. రోజుకు కనీసం 20 నుంచి 30 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర కొనసాగుతుందని, ఇప్పటి వరకు 20 వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర పూర్తయిందన్నారు. మరో 3 నెలల్లో అయోధ్యకు చేరుకుంటానన్నారు.

వేర్వేరు చోట్ల భారీగా నగదు పట్టివేత


సిర్పూర్(టి): పట్టుకున్న నగదుతో ఎస్సై, సిబ్బంది


వాంకిడి: పట్టుబడిన నగదుతో పోలీసులు


జన్నారం: పట్టుకున్న నగదు సీఐ, పోలీసులు

ఎన్నికల కోడ్ అమలులో భాగంగా సోమవారం వేర్వేరు చోట్ల పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది.

సిర్పూర్(టి): సిర్పూర్(టి)–మాకిడి రహదారిలోని హుడ్కిలి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన కుమ్రం నరేశ్ చంద్రపూర్ నుంచి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ.5 లక్షల నగదు తీసుకువస్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. హుడ్కిలి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎండీ ఆరీఫ్ 17 ఎల్‌జీ గ్రైండర్లతో పాటు రూ.84,983 నగదు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. హుడ్కిలి చెక్‌పోస్టు వద్ద కౌటాల మండలం ముత్తంపేట్‌కు చెందిన గజ్జెల్లి తిరుపతి వద్ద రూ.2,29,820 నగదు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని వెంకట్రావ్‌పేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా పిప్పల్‌వాడకు చెందిన బి.రాకేశ్ గోండ్‌పిప్రికి రూ.61,500 నగదు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాంకిడిలో రూ.1.90 లక్షలు

వాంకిడి: మండలంలోని నాలుగు వరుసల జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన తనిఖీలో రూ.1,89,400 నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. వాంకిడి నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా రూ.1,11,000 నగదు, మరో వాహనంలో రూ.78,400 నగదు పట్టుబడినట్లు తెలిపారు. నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

జన్నారంలో రూ.1.05 లక్షలు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లిలో ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాల వెళ్తున్న ఐచర్ వ్యానును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న కుమురంభీం జిల్లా తిర్యాని మండలానికి చెందిన పోచమల్లు వద్ద రూ.1,05,900 నగదు పట్టుబడినట్లు లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

వృత్తి కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా నిరుద్యోగ యువతీ, యువకులకు పలు వృత్తి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్షిప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్షిప్ తెలంగాణ స్టేట్ సహకారంతో కాస్మోటాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సోలార్ టెక్నాలజీ, సెల్‌ఫోన్ రిపేర్, టూ వీలర్ రిపేర్, ఆర్క్ వెల్డింగ్, గ్యాస్ వెల్డింగ్ కంప్యూటర్, తదితర 38 వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యువతీ, యువకులు శ్రీరాంపూర్‌లోని వృత్తి శిక్షణ కేంద్రంలో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో గత వారం రోజుల క్రితం ఓ విలేకరిపై దాడి చేసిన శ్రీరాంపూర్‌కు చెందిన మేకల రమేశ్, గుర్రం రాజేశ్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. చెన్నూర్ పట్టణంలోని మైనర్ బాలిక ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసేందుకు ప్రెస్‌క్లబ్ మీదుగా వెళ్తుండగా విలేకరి వెంకట్రాజ్ వేధిస్తున్నాడని దగ్గర బంధువైన మేకల రమేశ్‌కు చెప్పిందని తెలిపారు. ఈ నెల 11న రాత్రి సమయంలో ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న ప్రెస్‌క్లబ్ వద్ద వెంకట్రాజ్ ఒక్కడే ఉండగా రమేశ్, అతడి స్నేహితుడు గుర్రం రాజేశ్ దాడి చేసి శ్రీరాంపూర్ పరారీ అయ్యారని తెలిపారు. వెంకట్రాజ్ ఫిర్యాదు మేరకు సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి సోమవారం రమేశ్, రాజేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు.

కూచిపూడి కళాకారుల ప్రతిభ



అవార్డులతో కూచిపూడి కళాకారులు

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్‌లో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో శివరాత్రిని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్యం ఫెస్టివల్‌లో జిల్లా కూచిపూడి కళాకారులు ప్రతిభ చాటారు. వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు చక్కటి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. నందిని నృత్యాలయం వ్యవస్థాపకురాలు కల్పన ఆధ్వర్యంలో శిష్య బృందం కూచిపూడి ప్రదర్శనకు నంది అవార్డు, కల్పనకు శివనంది అవార్డు ప్రదానం చేశారు.

ఏసీపీని కలిసిన జీఎం


పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: జైపూర్ నూతన ఏసీపీ వెంకటేశ్వర్లును శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఆయన జైపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సింగరేణి గనులు, విభాగాల్లో దొంగతనాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు చర్చించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ మోహన్, సింగరేణి సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

'కార్పొరేషన్ పదవుల్లో ఎస్సీల వాటా మరిచారు'

పాతమంచిర్యాల: కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఎస్సీల వాటాను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైర్మన్ల ఎంపికలో మాలలను మరిచారని, మాలమాదిగలకు సమన్యాయం చేస్తామని చెప్పి కాంగ్రెస్ పెద్దలు మాట తప్పారని ఆరోపించారు. మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యమాల పులయ్య, ప్రధాన కార్యదర్శి దాసండ్ల ప్రభాకర్, కాసర్ల యాదగిరి, సందుల గంగారాం, మాదాసు మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టయ్య పాల్గొన్నారు.

మహిళ ప్రాణం కాపాడిన ప్రయాణికులు

మంచిర్యాలక్రైం: రైల్వేస్టేషన్‌లో పట్టాలపై పడుకుని ఉన్న మహిళను స్థానికులు కాపాడిన సంఘటన జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఒకటో ప్లాట్‌ఫాం రైలు పట్టాలపై మతి స్థిమితం లేని ఓ గుర్తు తెలియని మహిళ పడుకుని ఉంది. కాజీపేట వైపు నుంచి రైలు వస్తుండడంతో మహిళను గమనించిన ప్రయాణికులు చాకచక్యంగా రైలు పట్టాల పైనుంచి తప్పించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.